

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (సోమ)
సహరి : 4:52 (మంగళ)



వైసీపీ ప్రభుత్వ తీరును ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

అంగన్‌వాడీలకు.. తీపికబురు

- గ్రాట్యుటీ పెంపునకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు
- టీచర్లు, హెల్పర్లలో నూతనోత్తేజం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీల వెతలను తీరుస్తూ ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుకగా గ్రాట్యుటీ మొత్తాల పెంపును చెల్లించడానికి ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వారు ఏళ్ల తరబడి పడుతున్న కష్టాలకు చెక్ పడింది. వైసీపీ ప్రభుత్వంలో వివిధ సంస్కరణల పేరిట వారి ఉద్యోగంపై కత్తిదూసింది. వివిధ యాప్‌ల పేరిట పనిభారం, ఇతరత్రా ఇబ్బందులకు గురి చేశారే కాని జీతాలు పెంపు, ఇతర సౌకర్యాల పైన పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వారి సాధక, బాధలు విని వారికి ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంది. తొమ్మిది నెలల్లోనే గ్రాట్యుటీ పెంపు అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జిల్లాలో పది సీడీపీవో ప్రాజెక్టుల కార్యాలయాల పరిధిలో 2,225 అంగన్ వాడీ, మినీ కేంద్రాల్లో మొత్తం 1,24,078 మంది అంగన్‌వాడీ సేవలను పొందు తున్నారు. గర్భిణులు 7,669 మంది, బాలింతలు 10,315 మంది, ఆర్నెళ్లలోపు చిన్నారులు 8,989 మంది, ఏడు నెలలు నుంచి 36 నెలల వయస్సు కలిగిన చిన్నారులు 48,810 మంది, 3 నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు 48,295 మంది సేవలు పొందుతున్నారు. టీచర్లు 2వేల పైబడి ఉండగా, హెల్పర్లు 1,800 మంది వరకు ఉన్నారు. జీతాల కింద టీచర్ (కార్యకర్త)కు 11,500, హెల్పర్‌కు 7,500 ఇస్తున్నారు. తాజాగా గ్రాట్యుటీ వర్తింపుతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కనీసం రూ.లక్ష, సహాయకులకు రూ.60 వేలు ప్రయోజనం పొందనున్నారు. ఇంతకుముందు వారికి గ్రాట్యుటీల కింద రూ.50 వేలు, రూ.30 వేలే చెల్లించారు. దీనిని రెట్టింపు చేశారు.

చాలా ఆనందంగా ఉంది



నేను 15 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా చేపలతూము సెంటర్ కేంద్రంలో పనిచేస్తున్నా. కూటమి ప్రభుత్వం మేము చేసిన ఆందోళనలపై స్పందించి, అప్పట్లో ఇచ్చిన హామీని నెరవేర్చడం హర్షణీయం. మరో నాలుగేళ్లలో రిటైరవుతున్నా. ప్రభుత్వం పెంచిన గ్రాట్యుటీ అందుకొంటానని తెలిసి ఆనందంగా ఉంది.

- కనకదుర్గ, ఏలూరు 34 అంగన్‌వాడీ కేంద్రం

వైసీపీ ప్రభుత్వంలో ఎస్మా..

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం అంగన్ వాడీలు రోడెక్కి నినదించగా వైసీపీ ప్రభుత్వం చివరి సంవత్సరంలో పలు డిమాండ్లను పరిష్కరిస్తానన్న హామీ ఇచ్చి ఉత్త చేతులు చూపింది. దీనిపై 42 రోజుల పాటు ఏకబిగిన అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా కదంతొక్కారు. తెలంగాణ కంటే జీతాలు తక్కువని, గ్రాట్యుటీ అమలు చేయాలని గొంతెత్తారు. వైసీపీ ప్రభుత్వం కనికరం చూపకుండా వారి జీతాలను కోసేసి.. ఎస్మాను ప్రయోగించింది. వారి డిమాండ్లపై దాటవేత ధోరణితో వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం మాత్రం వీరి ఉద్యోగ భద్రతకు బీజం వేస్తూ గ్రాట్యుటీ చెల్లింపునకు ఉత్తర్వులు ఇవ్వడంతో సర్వత్రా టీచర్లు, హెల్పర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే రిటైర్‌మెంట్ వయో పరిమితి 62 ఏళ్లకు పెంచారు.

అంగన్‌వాడీలకు ఉపయుక్తం



చాలాకాలం నుంచి గ్రాడ్యూటీ పెంపు కోసం వారు ఆందోళనల బాటపట్టారు. ఈ ప్రభుత్వ హయాంలో పెంచిన గ్రాట్యుటీ వర్తింపు ఈ సంవత్సరంలో రిటైరయ్యేవారికి ఏడుగురు వరకు వర్తింపు చేసే అవకాశం ఉంది. రిటైరయ్యే ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఎంతో కొంత డబ్బులు వస్తుంటే వారి ఆనందం అంతా ఇంతా కాదు. ఇది వారికి ఉపయోగకరమే.

- మల్లిక, ఐసీడీఎస్ ఈవో

బుల్లెట్ నుంచి మంటలు

7

రూ.10 లక్షల విలువ చేసే ఐరన్ మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన గృహనిర్మాణ శాఖ డీఈ

7

ప్రేమించి.. పెళ్లి చేసుకుని వదిలేశాడు..

ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు



కొల్లేరులో పర్యటిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ నాయక్, డీఎఫ్‌వో విజయ

హద్దు..తేలేనా!

కొల్లేరులో కాంటూరు హద్దులను నిర్ధారించడం, ఆక్రమణలను తొలగించడం, చిత్తడి నేలలను సరిగ్గా సంరక్షించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో వివరిస్తూ ఈ నెల 19 లోపు నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వాస్తవానికి గతేడాది డిసెంబరులోనే ఆదేశాలు వెలువడగా స్థానికులను ఒప్పించే ప్రయత్నాలు జరిగాయి. స్వల్ప వ్యవధిలో హద్దులను తేల్చడం సాధ్యమా.. అనేది ప్రశ్నగా మారింది.

- కొల్లేరు ఆక్రమణపై సుప్రీం సీరియస్
- చిత్తడి నేలల సంరక్షణ పైనా ఆదేశం
- వన్యప్రాణుల సంరక్షణకు కేంద్రం పరిధిలో ఆంక్షలు
- సరస్సులోకి మురుగు, చెత్త నిషేధం
- సరిహద్దులు తేల్చి.. ఈనెల 19 లోపు నివేదిక ఇవ్వాలంటూ ఆదేశం
- ఇప్పటికే దీనిపై ఉన్నతస్థాయి సమీక్ష
- రంగంలోకి దిగిన అటవీ అధికారులు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కొల్లేరులో ఆక్రమణలను ఉక్కుపాదంతో అణిచివేయడంతో పాటు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇదే సమయంలో మత్స్యకారుల జీవనోపాధికి అడ్డంకులు ఉండవని వారిలో అవగాహన కల్పించాలని సూచించింది. కొల్లేరులోకి చెత్త,మురుగు రాకుండా సంరక్షణ చర్యలను నిర్దేశించింది. కొల్లేరులో సహజ నీటి ప్రవాహాన్ని అడ్డుకుని వన్యప్రాణులు మనుగడ ప్రమాదంగా మారడానికి కారణమైన ఆక్రమణలను ఉపేక్షించరాదని స్పష్టం చేసింది. కొల్లేరు సరిహద్దులను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. వాస్తవానికి కొల్లేరు కాలుష్య కాసారంగా మారడానికి అనేక కారణాలున్నాయి. 2006 వరకు కొల్లేరులో దురాక్రమణలు జరిగి వేలాది ఎకరాలు చేపల చెరువులుగా రూపాంతరం చెందాయి. వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి సైతం ఆటంకాలు సృష్టించారు. రాజకీయ పరపతితో ఇష్టారాజ్యంగా చెలాయించారు. సుప్రీం సాధికార కమిటీ రంగంలోకి దిగి కొల్లేరు సంరక్షణకు వీలుగా అప్పట్లో కొల్లేరు ఆపరేషన్ పేరిట అక్రమ చెరువులను ధ్వంసం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ లవ్‌అగర్వాల్ అటు సుప్రీం ఆదేశాలను అమలు చేసే బాధ్యతను తీసుకున్నారు. చెరువుల తొలగింపు కారణంగా తాము నష్టపోతున్నామంటూ కొల్లేరు వాసులంతా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదంతొక్కారు. ఆపై జిరాయితీ భూముల వ్యవహారం, ఐదో కాంటూరు ఎగువభాగం పేదలకు పంచే ప్రతిపాదన రెండు దశాబ్దాలుగా సాగుతూనే ఉన్నాయి.

ఆక్రమణలతోనే.. అల్లకల్లోలం

కొల్లేరులో ఆక్రమణలు ఆఖరికి వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి ఆటంకంగా మారాయి. కొల్లేరు సుమారు 901 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండగా 308 చదరపు కిలోమీటర్లు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం కింద కేంద్రం నోటిఫై చేసింది. దీంతో పాటు 6,908 హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగవుతున్నట్లుగా గుర్తించారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో వాణిజ్య కార్యకలాపాలను నిషేధించాలని కోర్టు ఆదేశించింది. ఈనెల 19వ తేదీలోగా తమ ఆదేశాలకు అనుగుణంగా ఏ చర్యలు తీసుకున్నారో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుప్రీంకోర్టు నివేదికను కోరిం ది. ఈ నేపథ్యంలో కొల్లేరు సరిహద్దులను గుర్తించడం, చిత్తడి నేలలు సంరక్షణకు ఏ చర్యలు తీసుకోవాలో గుర్తించేందుకు వీలుగా అటవీ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దింపింది. వాస్తవానికి ఇంతకుముందే కాంటూరు హద్దులను గుర్తించే విషయంలో రకరకాల విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. వీటి పరిష్కారానికి శాటిలైట్ సర్వే ఒకటే మార్గమని వివిధ వర్గాలు డిమాండ్ చేశాయి.

కొల్లేరులో అటవీ అధికారుల పర్యటన

సుప్రీం ఆదేశాలతో అటవీ అధికారులు రంగంలోకి దిగారు. సరిహద్దులను ఖరారు చేయాల్సిందిగా కోరడంతో ఆదివారం ఏలూరు రూరల్ పరిధిలోని గుడివాకలంక, కలకుర్రు, ప్రత్తికోళ్లలంక గ్రామాల పరిధిలో కొల్లేరు ప్రాంతంలో పర్యటించారు. కొల్లేరు సరిహద్దులను మ్యాప్‌ల ద్వారా పరిశీలించారు. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ నాయక్, డీఎఫ్‌వో పి.విజయ, రాజమండ్రి సీసీఎస్ డీఎన్ఎస్ మూర్తిలతో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఎవరి ప్రయత్నం వారిది..

కొల్లేరుపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు కొల్లేరు పరీవాహకంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, అటవీశాఖ ఉన్నతాధికారులతో ఇటీవల సమీక్షించారు. కొల్లేరు సరిహద్దులను గుర్తించేలా సర్వే నిర్వహించడమే కాకుండా, స్థానికుల్లోను అవగాహన కల్పించాలని, కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలని, సంబంధిత అధికారులంతా ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇదే తరుణంలో ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ కొల్లేరు ప్రాంత వాసులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ సైతం అంతకుముందే కొంత మంది కొల్లేరు వాసులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో న్యాయ నిపుణులతోను చర్చించారు.







దుబాయ్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ ఫైనల్‌లో టీమ్ ఇండియా న్యూజిలాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో విజయం సాధించడంతో జిల్లాలో పలుచోట్ల క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో జాతీయ జెండాలు చేతబూని బాణసంచా కాల్చుస్తూ స్వీట్లు పంచుతూ ఇలా సందడి చేశారు. - ఏలూరు క్రైం

ఛాంపియన్ ఇండియా

జిల్లా వ్యాప్తంగా అభిమానుల సంబరాలు

పీజీఆర్ఎస్ వికేంద్రీకరణ

నేడు జిల్లా, మండల, మునిసిపాలిటీల్లో ఫిర్యాదుల స్వీకరణ

ఏలూరు/ఏలూరు క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఇటీవల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో రద్దు చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఈ కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ సోమవారం నుంచి జిల్లాలో మరల నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే పీజీఆర్ఎస్‌ను వికేంద్రీకరించామని, మండల, డివిజనల్, మునిసిపల్, జిల్లా స్థాయిలో అమలు చేస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో సమర్పించాలన్నారు. ప్రజలకు, పాలనను మరింత చేరువ చేయడానికి ఈ వికేంద్రీకరణ చేసినట్టు తెలిపారు.

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోను..

ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఈనెల 10న జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లలోనూ, సర్కిల్ ఆఫీస్, సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

భీమడోలు రైల్వేగేటు తాత్కాలికంగా మూసివేత

ఏలూరు క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే గేటును తాత్కాలికంగా రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు మూసివేశారు. భీమడోలు గ్రామంలో 12 ఏళ్లకు జరిగే గంగానమ్మ జాతర ఆదివారం ముగింపు సందర్భంగా ఆ గ్రామానికి బంధువులు, స్నేహితులు వేలాది మంది వచ్చారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రజారక్షణ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ సీఐ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వే గేటును మూసివేసి అక్కడే బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాగా సోమవారం యథావిధిగా రైల్వేగేటును తెరవనున్నారు.

ఏఆర్‌టీ సెంటర్లకు వైద్యాధికారుల నియామకం

ఎయిడ్స్ రోగులకు తొలగిన ఇబ్బందులు

ఏలూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులకోసం ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి(ఏపీ సాక్స్) ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో నిర్వహిస్తున్న ఏఆర్‌టీ (యాంటీ రెట్రో వైరల్ థెరపీ) సెంటర్లకు వైద్యాధికారుల కొరత తీరింది. ఏలూరు ఏఆర్‌టీ సెంటర్‌కు డాక్టర్ శ్యాంసుందర్, జంగారెడ్డిగూడెం ఏఆర్‌టీ సెంటర్‌కు డాక్టర్ సుధాకర్‌లను నియమిస్తూ ఏపీ సాక్స్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల క్రితమే వీరిద్దరి నియామకాలు జరిగినప్పటికీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా విధుల్లో చేరలేదు. తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో ఈనెల 10న వీరిద్దరు తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరనున్నారు. కొంతకాలంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం ఏఆర్‌టీ సెంటర్లకు వైద్యాధికారులు లేనికారణంగా రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏలూరు ఏఆర్‌టీ సెంటర్‌లో మొత్తం 6500 మంది ఎయిడ్స్ రోగులు రిజిస్టర్ అయి ఉండగా, వైద్యపరీక్షలు, మందుల నిమిత్తం రోజుకు సగటున 250 మంది వరకు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టిన వైద్యాధికారుల నియామకాల వల్ల ఇక ఎయిడ్స్ రోగులకు వైద్యపరమైన సలహాలు, పరీక్షల గురించి ఇబ్బందులు తొలగినట్టయింది. కాగా ఏలూరు ఏఆర్‌టీ సెంటర్‌లో వైద్యాధికారుల కొరత భర్తీ అవుతున్నా ఇంకా స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టు, కౌన్సెలర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

నేడు జలదుర్గా గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు


పెద్దింటి అమ్మవారు


గోకర్ణేశ్వరస్వామి

కైకలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి (జలదుర్గ అమ్మవారు) కల్యాణం సోమవారం నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. జలదుర్గ అమ్మవారికి కొల్లేటికోటకు రెండు కిలోమీటర్ల దూరంలోని గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వరస్వామికి ఈ కల్యాణం నిర్వహిస్తారు. ఈ మేరకు తొలుత కొల్లేటికోటలో అమ్మవారిని పెండ్లికుమార్తెగా గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామిని పెండ్లికుమారుడిగా ముస్తాబు చేస్తారు. గోకర్ణపురం నుంచి పల్లకీలో భక్తులు స్వామిని ఊరేగింపుగా కొల్లేటికోటకు తీసుకొచ్చి రాత్రి 12 గంటల సమయంలో కల్యాణం నిర్వహిస్తారు. తొలుత అమ్మవారికి కలువబోనాల గ్రామోత్సవం నిర్వహిస్తారు. పందిరిపల్లిగూడెం గ్రామస్థులు భారీ ప్రభతో వేలాదిమంది భక్తుల మధ్య ఆలయానికి చేరుకుంటారు. కల్యాణం సందర్భంగా ఈవో కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తిచేశారు. జల్లు స్నానాలు, కేశఖండశాల, మంచినీరు, పారిశుధ్యం, చలువపందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

కాగా కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు వేలాదిమంది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచితప్రసాదం విజయవాడకు చెందిన కోయ వెంకటేశ్వరరావు, శివపార్వతి దంపతులు అందజేశారు. ఈవో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఉచితంగా మంచి నీరు, మజ్జిగ, పిల్లలకు పాలు పంపిణీ చేశారు. కైకలూరు రూరల్ ఎస్ఐ రాంబాబు బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు





వైభవంగా జైన్ మందిర్ ప్రతిష్ఠ

పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో నూతనంగా నిర్మించిన రాజేంద్ర సూరీజీ గురుధ్యాన జైన్ మందిర్ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జైన్ గురువులు ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జైన్ భక్తులతో జైన్ మందిరం కిక్కిరిసింది. జైన్ గురువులు పలు రకాల పూజలు, హోమాలు శిఖర ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు. జైన్ ట్రస్టు కమిటీ చైర్మన్ అజిత్ కుమార్ జైన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. - ఆచంట

క్లస్టర్ విధానాన్ని పునరాలోచించాలి

ప్రభుత్వానికి ఏలూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విజ్ఞప్తి

ఏలూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగు తున్న రేషనలైజేషన్‌లో భాగంగా క్లస్టర్ విధానాన్ని పునర్ ఆలోచించాలని ఏలూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌లో ఒక వీఆర్వోను నియమించడంతో రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 7,500 మంది క్యాడర్ స్ట్రెంత్ తగ్గిపోతోందన్నారు. మిగిలిన వీఆర్వోలను ఏం చేస్తారని, ఏ ప్రాతిపదికన మండలాల నుంచి మున్సిపాల్టీల నుంచి తీసుకుంటారు? వారందరికి ప్రమోషన్లు కల్పిస్తారా? లేక? మాతృశాఖలో విలీనం చేస్తారా? అనేది స్పష్టత ఇవ్వాలా అనేది డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్వోలందరికి సీనియార్టీ ప్రకారం ముందుగా పదోన్నతులు కల్పించిన తరువాతే రేషనలేజేషన్‌లో క్లస్టర్ విధానం తీసుకొచ్చి ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడపా రాంబాబు, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, అక్బర్ పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

విదేశీ భాషా కోర్సులు ఇక్కడ చదవొచ్చు



భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు సంబంధించిన సాధనం మాత్రమే కాదు. ఆధునిక కాలంలో అది కెరీర్ కూడా. మాతృభాషతోపాటు విదేశీ భాషలు నేర్చుకుని అద్భుతమైన కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎక్కువ భాషలు వస్తే అన్ని అవకాశాలు పెరుగుతాయి కూడా. భారతదేశంలో విదేశీ భాషలను ప్రైవేటు సంస్థలతోపాటు పలు ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా అందిస్తున్నాయి. ఇందులో బిగినర్ కోర్సులు, ఇంటర్మీడియెట్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు, స్పెషలైజ్డ్ కోర్సులు ఉంటాయి. బిగినర్ కోర్సులు కొంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందిస్తే ఇంటర్మీడియెట్ కోర్సులు భాషా పరిజ్ఞానాన్ని పెంచుతాయి. అడ్వాన్స్‌డ్, స్పెషలైజ్డ్ కోర్సులు అయితే కెరీర్‌కు కావాల్సిన భాషా సంపదను కలిగిస్తాయి. మన దేశంలో భాషకు సంబంధించి కోర్సులు అందించే ప్రభుత్వ వర్సిటీల్లో కొన్ని...

ఢిల్లీ యూనివర్సిటీ: ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, పర్షియన్, మోడరల్ అరబిక్, పాలీ, టిబెటన్ భాషా - సాహిత్యంలో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. https://www.du.ac.in/

బనారస్ హిందూ యూనివర్సిటీ: పలు విదేశీ భాషలకు సంబంధించిన డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను బనారస్ హిందూ యూనివర్సిటీ అందిస్తోంది. ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, చైనీస్ భాషలు ఇందులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. https://www.bhu.ac.in/

గురునానక్‌దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్: ఈ వర్సిటీలో ఫ్రెంచ్‌లో ఫుల్‌టైమ్ డిప్లొమాలు, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్ భాషల్లో పార్ట్‌టైమ్ డిప్లొమాలు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్రెంచ్‌లో పార్ట్‌టైమ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కూడా అందుబాటులో ఉంది. వీటికి దరఖాస్తు చేయడానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. https://www.gndu.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ: భాషలకు సంబంధించిన పలు కోర్సులను ఈ యూనివర్సిటీ అందిస్తుంది. జర్మన్, రష్యన్, స్పానిష్, జపనీస్, కొరియన్, చైనీస్ తదితర భాషలకు సంబంధించిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఇక్కడ ఉన్నాయి. www.jnu.ac.in/main/

సీఫెల్, హైదరాబాద్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో ఉన్న 'సీఫెల్' పలు యూరోపియన్ భాషలకు సంబంధించిన కోర్సులను అందిస్తుంది. ఇందులో ఫ్రెంచ్, ఫ్రాన్కోఫోన్ స్టడీస్, జర్మనిక్ స్టడీస్, హిస్పానిక్ స్టడీస్, లాటిన్, రష్యన్‌కు స్టడీస్ తదితరాలపై పలు కోర్సులు ఉన్నాయి. https://www.efluniversity.ac.in

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో డిప్లొమా అడ్మిషన్లు

హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్'(సీఐటీడీ)లో 2025-26 సంవత్సరానికి కింది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. 1968లో ఏర్పాటైన కేంద్రప్రభుత్వ సంస్థ ఇది. ఇందులో సర్టిఫికెట్, డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఎంఈ, ఎంటెక్ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ వెలువడింది.

కోర్సులు	సీట్లు
● డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్(డీటీడీఎం)	60
● డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)	60
● డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ)	60
● డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ)	60

(డీటీడీఎం కోర్సు నాలుగు సంవత్సరాలు - మిగిలిన కోర్సు మూడు సంవత్సరాలు)

విద్యార్హతలు: డీటీడీఎం కోర్సు చేయాలంటే కనీసం 50 శాతం మార్కులతో పది పాసై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.

వయోపరిమితి: 2025 మే 22 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో చేయవచ్చు.

పరీక్ష విధానం: పదో తరగతి స్థాయిలో మేథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతోపాటు, ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 మే 22. **ప్రవేశ పరీక్ష:** 2025 మే 25

Contact Details: Admission Desk at Diploma Block
Ph: 9502405170, 040-29561795 **E-Mail:** training@citdindia.org,
Website: https://www.citdindia.org

ఐఐఐటీ శ్రీసిటీలో ఎంటెక్

వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్



గ్లోబల్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ 2026 నాటికి 64 బిలియన్ డాలర్లు చేరుకుని, 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు దాటుతుందని మెకిన్సే కంపెనీ అంచనా వేసింది. అందువల్ల వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ విపరీతంగా ఉంటుందని చెబుతోంది. అలాగే 2025 సంవత్సరం చివరి నాటికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) మార్కెట్ రెండు బిలియన్ డాలర్లు ఉండవచ్చని నాస్కామ్ చెబుతోంది. అటానమస్ వెహికిల్స్, డ్రోన్లు తదితరాల కారణంగా ఎంబెడెడ్ సిస్టమ్స్, అటానమస్ టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్నాయి. ఇక సైబర్ సెక్యూరిటీ గురించి చెప్పాల్సిన పని లేదు. 2025 చివరి నాటికే ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో తమ కంపెనీ సైబర్ సెక్యూరిటీ బడ్జెట్‌ను అన్ని కంపెనీలు రెండింతలు చేయనున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని శ్రీసిటీలో ఉన్న 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'(ఐఐఐటీ) ఎడ్ కంపెనీ టీమ్ లీజ్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించింది. వీఎల్ఎస్ఐ, ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీల్లో ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ఎంటెక్ - వీఎల్ఎస్ఐ: సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్, అనలాగ్ సర్క్యూట్ డిజైన్, సిస్టమ్ ఆన్ చిప్ డెవలప్‌మెంట్‌పై కోర్సు ఉంటుంది. దీనితోపాటులో పవర్ వీఎల్ఎస్ఐ, నానో స్కేల్ డివైజెస్, మిక్స్‌డ్ సర్క్యూట్ డిజైన్‌లపై ఫోకస్ ఉంటుంది. సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్, చిప్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ రోల్స్ కోసం పనిచేసేలా విద్యార్థులను తయారు చేస్తారు.

ఎంటెక్ - ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్: ఐవోటీ ఆర్కిటెక్చర్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, అటానమస్ డెసిషన్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, 5జీ/6జీ టెక్నాలజీస్, డిజిటల్ ట్విన్ అప్లికేషన్స్ తదితరాల్లో ప్రావీణ్యం ఉండేలా రూపొందిస్తున్నారు.

ఎంటెక్-సైబర్ సెక్యూరిటీ: క్రిప్టోగ్రఫి, ఎథికల్ హాకింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, ఏఐ ఆధారిత థ్రెట్ డెసిషన్ తదితరాల్లో నాలెడ్జ్ ఉండేలా రూపొందించారు. బ్లాక్‌చైన్ అప్లికేషన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్ లాంటి వాటిలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ వచ్చేలా చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు తదితరాల సైబర్ సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ పరిష్కరించేలా ఉంటారు. 2025 జూలై నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయి. సంవత్సరంలో ఒక వారం క్యాంపస్‌కి రావాల్సి ఉంటుంది. మిగిలిన క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీటెక్/బీఈ/ ఎమ్మెస్సీ/ ఎంసీఏ డిగ్రీని పూర్తిచేయాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 50 శాతం చాలు. అభ్యర్థులకు 'గేట్' స్కోరు తప్పనిసరి కాదు.

ఫీజు: సెమిస్టరుకు రూ. 65000/- చొప్పున నాలుగు సెమిస్టర్లకి కలిపి రూ. 2,60,000/- అవుతుంది.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్, ఫోన్‌లను సంప్రదించవచ్చు.
040-49170726, admission@iiitsricityonline.com
https://cep.digivarsity.com/iiit-sricity/

SCHOLARSHIP ALERT

Narotam Sekhsaria Scholarships for Higher Studies

Description: Narotam Sekhsaria Scholarships for Higher Studies 2025-26 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation that aims to provide financial assistance to outstanding Indian students aspiring to pursue higher education at prestigious institutions in India and abroad.
Eligibility: Applicants must be an Indian national residing in India and a graduate from an accredited Indian university. They should be under 30 years old as of 31st January 2025. They must plan to pursue a postgraduate degree in top-ranking institutions in India or abroad, starting in the Fall 2025.
Prizes & Rewards: The scholarship offers interest-free loans as financial assistance including mentorship support.
Last Date: 17-03-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/NSSP1

India High Fliers Undergraduate



Description: India High Fliers Undergraduate Scholarships 2025 is provided by the University of Birmingham to students pursuing selected full-time undergraduate programs at the university. A total of 20 scholarships will be available for the academic year 2025-26.
Eligibility: Applicants must be a domiciled resident of India holding an offer for a full-time undergraduate program. They must be classified as overseas fee-payer student.
Prizes & Rewards: The scholarship offers an amount of GBP 5,000 for the first year of undergraduate studies.
Last Date to Apply: 31-05-2025
Application mode: Offline applications via local representatives and partnered schools
Short Url: www.b4s.in/aj/IHFS1

Vahani Scholarship

Description: The Vahani Scholarship for 2025-26 is offered by the Vahani Group to Class 12 students. This scholarship aims to support students from economically disadvantaged backgrounds in India to pursue their higher education.
Eligibility: Open to Indian citizens currently studying in Class 12 and appearing for the final board examination next year. Applicants must have secured at least 85% marks in Class 10. The applicant's annual family income must be less than 300,000 from all sources.
Prizes & Rewards: Full tuition fees, stipend, and other benefits. ***Last Date:*** 01-12-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/VAHS1

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

షూటింగ్ పూర్తి



కంగనా రనౌత్, మాధవన్ జంటగా మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రధారులుగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని కంగన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. చిత్రబృందంతో సెట్‌లో దిగిన ఫొటోలను షేర్ చేశారు. త్వరలోనే టైటిల్‌ను ప్రకటించి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రం తర్వాత కంగన, మాధవన్ కలసి నటించిన చిత్రమిది. అలాగే 'తలైవి' చిత్రం తర్వాత మరోసారి ఏఎల్ విజయ్ దర్శకత్వంలో కంగన నటించారు. తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కొత్త ప్రయాణం మొదలు



నటి అభినయ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. చిన్ననాటి స్నేహితుణ్ణి ప్రేమించాననీ, త్వరలో అతన్ని పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె తెలిపారు. ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభినయ తెలిపారు. కాబోయే భర్తతో కలసి ఆలయంలో గంట కొడుతున్న ఫొటోను షేర్ చేసి, 'కొత్త ప్రయాణం మొదలైంది' అని చెప్పారు. అయితే కాబోయే భర్త వివరాలు, పెళ్లి ఎప్పుడు జరగబోతోంది అనే విషయాలను ఆమె తెలపలేదు. పలు దక్షిణాది సినిమాల్లో నటించిన అభినయ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, శంభో శివ శంభో' తదితర చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్నారు.

భయానక అనుభవాల కథ



యదార్థ సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ - ఆర్వి ప్రొడక్షన్స్ బేనర్‌పై గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో రవిశంకర్ వర్మ నిర్మించారు. సత్య యాదు, ఆరాధ్యదేవి జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పలు భారతీయ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఎదుర్కొన్న భయానక అనుభవాల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఓ మంచి సినిమాతో నిర్మాతగా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని రవిశంకర్ చెప్పారు.



శ్రీలీలకు చిరంజీవి కానుక

నటి శ్రీలీలకు చిరంజీవి ఓ విలువైన కానుకను బహూకరించారు. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా సెట్స్‌లో శ్రీలీల సందడి చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా దుర్గాదేవి ప్రతిమ ఉన్న ఓ వెండి శంఖాన్ని ఆమెకు కానుకగా ఇచ్చారు చిరంజీవి. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు శ్రీలీల. భారీ బడ్జెట్‌తో వంశీ, విక్రమ్, ప్రమోద్ 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కూడా ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు.

చరిత్రలో నిలిచిపోయే చిత్రం...



'మల్లేశం', '8 ఏఎమ్ మెట్రో' చిత్రాల దర్శకుడు రాజ్ రాచకొండ. ఆయన దర్శకత్వంలో కొత్త చిత్రం రాబోతోంది. నటుడు రానా దగ్గుబాటి సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా, స్టూడియో 9తో కలసి నిర్మిస్తోంది. తేజ, తన్మయి, ఝాన్సీ, తాగుబోతు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 1990ల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు '23' అనే టైటిల్‌ను ఖరారు చేసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ "ఈ సినిమా మానవ హక్కుల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. అన్యాయానికి గురైన వారికి అండగా ఉంటుంది. తప్పు చేయడం తప్పని చెప్పడంతో పాటు హింసకు వ్యతిరేకంగా ఉంటుంది" అని అన్నారు. "ఈ సినిమాను ప్రేక్షకులు వెతుక్కుంటూ వచ్చి చూస్తారు. చరిత్రలో నిలబడిపోతుంది" అని నటి ఝాన్సీ చెప్పారు.

స్పెషల్ సాంగ్‌తో సిద్ధమా?

సినిమాల్లో కథానాయిక పాత్రల్లో అలరించడమే కాదు, అప్పుడప్పుడూ రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ మెరుస్తుంటారు తారామణులు. జనాల్లో క్రేజ్ పెంచడమే కాకుండా సినిమా విజయానికీ దోహదపడుతుంటారు. తాజాగా అగ్రహీరోలతో ప్రత్యేక గీతాలు చేస్తున్నారంటూ కొంతమంది హీరోయిన్ల పేర్లు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. వారెవరో తెలుసుకుందాం.



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజాసాబ్'. ఈ హారర్ థ్రిల్లర్‌లో మాంచి జోష్‌తో నిండిన ప్రత్యేక గీతం ఉందట. ఈ పాటలో స్టెప్పులేసేందుకు ఓ స్టార్ హీరోయిన్ అయితే బావుంటుందని భావించిన చిత్రబృందం నయనతారని సంప్రదించారని టాక్. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. గతంలో ప్రభాస్‌కు జంటగా 'యోగి' సినిమాలో హీరోయిన్‌గా నటించారు నయనతార. ఇక 'యానిమల్' సినిమాలో అందాల ఆరబోతతో అలరించిన త్రిప్తి దిమ్రీని సైతం మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. అయితే, వీరిలో ఎవరు ఫైనల్‌గా పాటలో కనపడతారనేది తెలియాల్సి ఉంది.

ఎన్టీఆర్.. హృతిక్‌తో

2022లో వరుణ్‌ధావన్ హీరోగా నటించిన 'భేడియా' చిత్రంలో 'తుమ్‌కేశ్వరీ' అనే ప్రత్యేక గీతంలో మెరిశారు శ్రద్ధా. 'పుష్ప 2'లో 'కిస్సిక్' సాంగ్ కోసం మొదట శ్రద్ధాని సంప్రదించినా పారితోషికం తక్కువని ఆమె అంగీకరించలేదు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'లో ఆమె స్పెషల్ సాంగ్ చేయబోతున్నారట. 2019లో విడుదలై సూపర్ హిట్ సాధించిన 'వార్'కు ఇది కొనసాగింపు. ఈ సినిమాపై తారస్థాయిలో ఉన్న అంచనాలను మరింత పెంచేలా ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. అందు కోసం ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నారు. 'స్త్రీ 2'తో ఇండస్ట్రీ హిట్ కొట్టిన శ్రద్ధా కపూర్‌ను ఈ పాట కోసం సంప్రదించారని టాక్. మంచి డ్యాన్సరైన శ్రద్ధా తన స్టెప్పులతో.. ఎన్టీఆర్, హృతిక్ ఎనర్జీని పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేస్తారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారట.

ఒకేసారి రెండు చిత్రాల్లో..

'గేమ్ ఛేంజర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కియారా అద్వానీ. యశ్ కథానాయకుడిగా 'ముథూన్' ఫేమ్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే, ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో కూడా ఆమె కనిపించనున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన 'సలార్' చిత్రానికి సీక్వెల్‌లో కీలక పాత్రతో పాటు ప్రత్యేక గీతంలో కియారా తళుక్కున మెరవనున్నారనే టాక్ నడుస్తోంది. 2022లో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'గోవింద్ మేరా నామ్' చిత్రంలో 'బిజిలీ' అనే ప్రత్యేక గీతంలో నటించారు కియార.

సీక్వెల్‌లోనూ ఛాన్స్

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్' సినిమా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో తమన్నా భాటియా చేసిన 'నువ్వే కావాలయ్యా' ప్రత్యేక గీతం పెద్ద హిట్ అయింది. దీంతో ఈ సినిమా సీక్వెల్‌లో తమన్న పాత్ర నిడివిని పెంచడంతో పాటు ఆమెతో ప్రత్యేక గీతం ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఇటీవలే తమన్న 'స్త్రీ'లో ఓ స్పెషల్ సాంగ్ చేయడం.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో.. ఆ సెంటిమెంట్ కలిసొస్తుందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారట మేకర్స్.

ఓజీ కోసం రాధిక

'డీజే టిల్లు' చిత్రంతో యువతరాన్ని ఆకట్టుకున్న కథానాయిక నేహా శెట్టి. ఆ చిత్రంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఈ భామకు ఓ సూపర్ ఆఫర్ వచ్చింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ప్రత్యేక గీతం కోసం నేహా శెట్టిని ఎంపిక చేశారు. అయితే, ఇందులో ఆమె కేవలం ఓ పాటకే పరిమితమవుతారా లేదా కీలక పాత్రలో నటిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది.

మరోసారి ప్రత్యేక గీతంలో

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'రెట్రో'. మే 1న విడుదలవనున్న ఈ సినిమాలో శ్రియ ఓ ప్రత్యేక గీతంలో స్టెప్పులేశారని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పవన్‌కల్యాణ్ నటించిన 'పులి'.. వెంకటేశ్ నటించిన 'తులసి'.. తరుణ్ నటించిన 'సోగ్గాడు'.. ప్రభాస్ నటించిన 'మున్నా' వంటి పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కుమన్నారు శ్రియ.



వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

భక్తులతో కళకళలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గోవిందుని నామాలను స్మరిస్తూ వచ్చిన భక్తులతో చిన వెంకన్న క్షేత్రం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. సెలవుదినం కావడంతో ఆదివారం అధిక సంఖ్యలో భక్తజనులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూ కాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు పదివేల మంది వరకూ స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ అధికారులు అంచనా. దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు.



గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

బుట్టాయగూడెం,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మన్యం ఏజెన్సీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి దర్శించుకుని మొక్కుబడులు తీర్చు కున్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.



సాగర తీరంలో సేద తీరిన సందర్శకులు

మొగల్తూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలు, ఉక్కబోతతో సతమతమవుతున్న జనం ఆదివారం పేరుపాలెం, కేపీ పాలెం సాగర తీరంలో సేదతీరారు. పలు ప్రాంతాల నుంచి యువతీ, యువకులతో పాటు కుటుంబ సభ్యులతో సందర్శకులు తరలివచ్చి సముద్ర స్నానం చేశారు. తీరం వెంబడి గల కొబ్బరి, మామిడితోటల్లో చల్లని వాతావరణంలో ఆనందంగా గడిపారు.

15 నుంచి పాలకొల్లులో జాతీయ స్థాయి నాటిక పోటీలు

పాలకొల్లు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకూ జాతీయ స్థాయిలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షుడు కెవి కృష్ణ వర్మ తెలిపారు. పట్టణంలోని అడబాల థియేటర్ వెనక ఉన్న ఖాళీ స్థలంలో వేదిక ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. 15వ తేదీ రాత్రి 8గంటలకు భీమవరం చైతన్య భారతీ నృత్య నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ముందురోజు తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి 'విడాకులు కావాలి' నాటికతో పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. అనంతరం కాట్రపాడు ఉషోదయ కళాపరిషత్ వారి 'కిడ్నాప్' , 2వ రోజు ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్ వారి 'ఇది రహదారి కాదు' విశాఖపట్నంకు చెందిన చైతన్య కళాశ్రవంతి వారి '(అ)సత్యం' నాటిక, చిలకలూరి పేటకు చెందిన మద్దుకూరి ఆర్ట్ క్రియోషన్స్ వారి 'మా ఇంట్లో మహాభారతం' నాటిక ప్రదర్శన ఉంటుందని, ఆఖరి రోజు 17వ తేదీ సోమవారం రోజు రాత్రి 7.30కి గుంటూరు అమరవాతి ఆర్ట్స్ వారి 'చిగురు మేఘం', ఒంగోలు పండూ క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు' పాలకొల్లుకు చెందిన నటీనట సమాఖ్య వారి అనూవ్యం (ప్రత్యేక ప్రదర్శన) ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.



కాళికా విజయం నాటక ప్రదర్శన

అలరించిన కాళికా విజయం

ఏలూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మైమరిపించే దృశ్యాలు, అబ్బురపరిచే సన్నివేశాలతో సురబివారి కాళికా విజయం నృత్యప్రదర్శన ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించింది. ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆదివారం అభినయ నృత్యభారతి, ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమసంఘం అఖిలభారత తెలుగుసేన, నృత్యదర్పణ హైదరాబాద్, వివిధ సాంస్కృతిక స్వచ్ఛంధ సేవాసంస్థల ఆధ్వర్యంలో సకల కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు కళారంగ ప్రవేశం చేసి 60 వసంతాలు వేడుకను ఘనంగా నిర్వహించారు. అంబికారాజా, మనోహర్‌గోపాల్ లునాని, ఆలపాటి నాగేశ్వరరావు, సెలా రాజాబాబు, కె.శ్రీనివాస్, ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. కళాకారుడిగా, పేద కళాకారుల సంక్షేమానికి దువ్వి రామారావు 60 ఏళ్లుగా చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ వెంకట్ సార ధ్యంలో సుమారు 40 మంది నర్తకి, నర్తకులు సురబి సెట్టింగ్స్‌తో కాళికా విజయం నృత్యనాటిక విశేషంగా అలరించింది. అనంతరం కళాకారులు, కళాభిమానులకు ఘనంగా సత్కరించారు.

మామిడీలా

నిరాశాజనకంగా మామిడి ఫలసాయం

ఆందోళన చెందుతున్న కౌలు రైతులు

మొగల్తూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ తీరంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన మామిడి ఫలసాయం ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారింది. వాతావరణ మార్పుల కారణంగా పిందె దశలోనే మామిడిఫలసాయం ముగ్గిపోయి రాలిపోవడంతో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంతంలో ఇసుక నేలల్లో మంచులో తేమ గల వాతావరణం ఉండటంతో మొగల్తూరు, నరసాపురం మండలాల్లో వేలాది ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి



ఎండల ప్రభావానికి మాడిపోతున్న మామిడి పూత

ఉన్నాయి. 2024 డిసెంబర్ నెలలోపు వర్షాలు పెద్దగా లేకపోవడంతో మామిడి పూతలు జనవరి నాటికి గానీ రాలేదు. జనవరి నెలలో పూత పూయడానికి, మంచు ప్రభావంతో పూత మాడకుండా ఉండేందుకు మామిడి రైతులు మందులు పిచికారీ చేస్తారు. దీంతో ఈ ఏడాది దిగుబడి ఆలస్యమైంది. పిందె దశకు వచ్చే సరికి ఎండల ప్రభావంతో పిందెలు పండి రాలిపోతున్నాయి. దీనికి నల్లమసి తెగులు సోకడంతో పూత కాస్తా మాడిపోయి దిగుబడిపై ప్రభావం చూపింది. మామిడి చెట్లుకు ఈ తెగులు రావడంతో చేతికి వచ్చిన మామిడి ఫలసాయం తగ్గుతుందని, పండులోపల పురుగులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొగల్తూరు మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం, మోడి, ముత్యాలపల్లి గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ తోటలను తీరంలో ఎక్కువ మంది కౌలు రైతులు ఎకరాకు తోటను బట్టి రూ.50 వేలు వరకూ లీజుకు తీసుకుని సస్యరక్షణ చర్యలకు వేలాది రూపాయలు వెచ్చిస్తుంటారు. అయితే ఈ ఏడాది పూత , పిందె దశలోనే దిగుబడి దెబ్బతినే విధంగా ఉందని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యానవన శాఖాధికారులు మామిడి రైతులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు, సబ్సిడీపై సస్యరక్షణకు మందులు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పిందె దశలోనే పండి రాలిపోతున్న మామిడి కాయలు



జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న నిరుద్యోగ యువత.. ఉద్యోగాలు పొందినవారికి నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

మెగా జాబ్‌మేళాలో 2,760 మందికి ఉద్యోగాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి లోటస్ స్కూల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి రెస్పాన్స్ లభించిందని 2,760 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు స్కూల్ కరస్పాండెంట్ బొలిశెట్టి రాజేష్ తెలిపారు. హైద్రాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాలతో పాటు తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం నుంచి 60కి పైగా సంస్థల ప్రతినిధులు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆదివారం స్కూల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే సంకల్పంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళాలో జీఎంఆర్ ఎయిర్ కార్గో, మెడిప్లస్, విజేత, టాటా వెస్ట్ సైడ్, టెక్నో టాస్క్, అపోలో, టీసీఎల్ కాస్ట్, జేఎఫ్ వెటకో విప్రో, హెట్రోడ్రగ్స్ నోకియా సొల్యూషన్స్ తదితర కార్పొరేట్ సంస్థలతోపాటు స్థానిక కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించారు.

ఇదో మంచి అవకాశం



- నేను ఇంటర్ చదివాను. ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువు తున్నాను. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం సాధించాలని పాల్గొన్నాను. జాబ్‌మేళా ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

కంబాబల మధుశ్రీ, పడమరవిప్పర్రు



- నేను బీటెక్ పూర్తి చేశాను.గతంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు కూడా అంతంత మాత్రంగానే ఉండేవి. గత ప్రభుత్వంలో సరైన ఉద్యోగ అవకాశాలు లేక చాలా ఇబ్బంది పడ్డాం. కూటమి ప్రభుత్వంలో ఇలా జాబ్‌మేళాలు నిర్వ హించి నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలి.

పూడి శివశంభు, గరగపర్రు



- నేను డిగ్రీ చేశాను. మాది హైద్రాబాద్. మాకు తెలిసిన వారి ద్వారా ఇక్కడ జాబ్‌మేళా జరుగుతున్నట్టు తెలుసుకుని వచ్చాను. ఇక్కడ రెస్పాన్స్ బాగుంది. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి జాబ్ మేళాల నిర్వహణ ఆనందంగా ఉంది.

యర్రబోలు దేవిక, హైద్రాబాద్



- నేను డిగ్రీ చదివాను. కోజాయింట్ సంస్థలో ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.18 వేల జీతం.. ఈ అవకాశం సద్విని యోగం చేసుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు ఈ జాబ్‌మేళా ఓ సువర్ణ అవకాశంగా భావిస్తున్నాను.

ఎం.జాహ్నవి, తాడేపల్లిగూడెం



డీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదు లకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస వర్మ, డాక్టర్ నిమ్మల

విద్యతోనే పేదరిక నిర్మూలన,అభివృద్ధి

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

పాలకొల్లు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని, విద్యతో పేదరికం నిర్మూలన సాధ్యవుతుందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస వర్మ, డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు డీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రుసా నిధులు రూ. 1.40 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏ ఒక్క పని చేయలేదని, అన్ని శాఖలను నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాకర్ రవిశంకర్, అధ్యాపకులు జాన్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నాయకులు హరికిషోర్, గణపతిరావు, పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 5,236 కేసులు పరిష్కారం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్



ఏలూరు క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులలో 5,236 కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు 132 పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్ తెలిపారు. వీటిలో 4,919 క్రిమినల్ కేసులు పరిష్కరిం చామన్నారు. 162 మోటారు వాహన ప్రమాద బీమా కేసులు పరిష్కరించి 11 కోట్ల రూపాయలు నష్టపరిహారంగా కక్షిదారులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఏలూరులో 1268 కేసులు, భీమవరం 896, చింతలపూడి 184, జంగారెడ్డిగూడెం 371, కొవ్వూరు 300, నర్సాపురం 292, పాలకొల్లు 176, తాడేపల్లిగూడెం 495, తణుకు 743, నిడదవోలు 465, భీమడోలులో 46 కేసులు పరిష్కరించామన్నారు.



వరల్డ్ రికార్డు సాధించిన కరాటే విద్యార్థులతో ఆరిమిల్లి

కరాటేలో తణుకు విద్యార్థుల ప్రతిభ

తణుకు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణానికి చెందిన కె.ఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకు చెందిన కరాటే విద్యార్థులు యునైటెడ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఆదివారం సాయంత్రం తణుకు బాలురున్నత పాఠశాల ప్రాంగణంలో అకాడమీ చైర్మన్ డా.కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులు 22 యోగాసనాలు చేస్తూ మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శించి ఈ రికార్డు సాధించారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వి.ఆర్సన్ వ్యవహరించారు. విద్యార్థులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకటకృష్ణ, డాక్టర్ రెడ్డిజ్యోతి కృష్ణ అభినందించారు.

ప్రైవేటు బస్సు సర్వీసులపై ఆర్టీసీ ప్రత్యేక సర్వే

భీమవరం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న నాలుగు ఆర్టీసి డిపోల పరిధిలో సంస్థకు పోటీగా నడుస్తున్న ప్రైవేట్ బస్సుల సంఖ్యపైన, సేవలపైన ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. ప్రతీ ఏడాది ఇటు వంటి సర్వే నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల జిల్లాలోని భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోలకు చెందిన అధికారులు, సిబ్బంది సర్వే చేశారు. జిల్లా నుంచి 110 ప్రవేట్ బస్సులు ఉన్నట్లు గుర్తించారు. ఈ సర్వీసుల్లో ఎక్కువగా తూర్పుగోదావరి జిల్లా నుంచి, యానాం నుంచి బయలుదేరే బస్సుల సంఖ్య ఎక్కువగా ఉన్నయని నిర్ధారించారు. ప్రైవేట్ బస్సులల్లో ఎక్కువగా స్లీపర్ సర్వీసులు ఉన్నట్లు లెక్క తేల్చారు. తణుకు, తాడేపల్లిగూడెం మీదుగా బెంగుళూరు, హైదరాబాద్‌కు ఎక్కువ బస్సులు నడుస్తున్నాయి. 11 బస్సులు బెంగుళూరు వెళుతుండగా, దాదాపు 50 కు పైగా బస్సులు హైదరాబాద్‌కు నడుస్తున్నాయి.

జిల్లా నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న ఆర్టీసీ బస్సుల్లో చాలావరకు నాన్ ఏసీ సర్వీసులు ఉన్నాయి. తణుకు డిపో నుంచి రెండు ఏసీ బస్సులు మాత్రమే ఉన్నట్లుగా చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఆర్టీసీ సంస్థ ప్రయాణికులను మరింత చేరువ అయ్యేందుకు ఎటువంటి బస్సులను ఏర్పాటు చెయ్యాలి.ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను ప్రాతిపదికగా మార్పులు చేపట్టేందుకు ఈ సర్వే చేపట్టినట్టు తెలుస్తోంది.

వైద్య ఉద్యోగుల విధుల బహిష్కరణ వాయిదా

భీమవరం క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు తమ దీర్ఘకాలిక ప్రధాన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రభుత్వానికి సమస్యను నేరుగా తెలియజేయాలని మార్చి 10, 17, 24 తేదీల్లో శాంతియుత విధులు బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. అయితే 10వ తేదీన జరగవలసిన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తూ మార్చి 12న చర్చలకు హాజరుకావాలని రాష్ట్ర యూనియన్ నాయకులకు ట్రస్ట్ నుంచి సర్క్యులర్ ఇచ్చారు. అందువల్ల ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర యూనియన్, జిల్లా యూనియన్ నాయకులు తెలిపారు.

12న జరిగే చర్చల్లో న్యాయం జరగకపోతే మార్చి 17, 24 తేదీల్లో విధులు బహిష్కరణ, శాంతియుత నిరసన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిాస్ యూనియన్ అధ్యక్షుడు తెలిపారు.



బుల్లెట్ నుంచి మంటలు

మొగల్తూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది.మొగల్తూరు మండలం పేరుపాలేనికి చెందిన ఒక వ్యక్తి తన భార్య, పిల్లలతో మొగల్తూరు నుంచి పెట్రోల్ కొట్టించుకుని పేరుపాలెం వెళుతుండగా రామాలయం సెంటర్ సమీపంలో బైక్ నుంచి మంటలు రావడాన్ని గమనించి ఒక్కసారిగా బైక్‌పై నుంచి దిగిపోయారు. స్థానికులు మంటలు వ్యాప్తి చెందకుండా నీళ్ళు ఇసుక వేసి మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న నరసాపురం అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ తీసుకువచ్చి మంటలను అదుపు చేశారు.

క్రైమ్ కార్నర్

అనుమానస్పదంగా యువకుడి మృతి

భీమవరం క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక యువకుడు మృతి చెందినట్టు టూటౌన్ ఎస్ఐ ఇజ్రాయేల్ తెలిపారు. భీమవరం 39వ వార్డు దుర్గాపురంలో ఆరేపల్లి విజయకుమార్ (20) నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈనెల 7వ తేదీన భార్యాభర్తలు తగాదా పడ్డారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో విజయకుమార్ అక్కడకు వెళ్ళి వారితో మాట్లాడాడు. అనంతరం ఈ నెల 8వ తేదీన ఇంటికి వచ్చి ఉరి వేసుకున్నాడు. ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో తలుపులు బద్ధలుకొట్టి చూడగా విజయకుమార్ మృతి చెందాడు. తండ్రి ఏసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లిఫ్ట్ పడి మహిళా కూలీ మృతి..ఇద్దరికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం డీఎస్ చెరువు వద్ద భవణ నిర్మాణ స్లాబు వేస్తుండగా లిఫ్ట్ కూలి మహిళా కూలీ మృతి చెందింది. ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం లోని డీఎస్ చెరువు వద్ద మూడో ఫ్లోర్ నిర్మాణంలో భాగంగా ఆదివారం స్లాబు వేసేందుకు బంటాను మాట్లాడారు. అయితే స్లాబు వేసేందుకు వేసిన లిఫ్ట్ నిర్మాణంలో భద్రతాప్రమాణాలు పాటించకపోవడంతో కాంక్రీటు వేసేందుకు పైకి వెళ్తుండగా ఆ లిఫ్ట్ పెంటపాడు మండలం జట్లపాలెంకు చెందిన చింతా రమణమ్మ (32) తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న ఆవుల వెంకన్న, వీరం వెంకటేశ్వర్లుకు తీవ్రగాయా లయ్యాయి.వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకన్న తలకు పెద్దగాయం కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం వివరించారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి



జంగారెడ్డిగూడెం, (ఏలూరు) మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త చుక్కా మహాలక్ష్మి (51) మృతి చెందారు. మహాలక్ష్మి బైపాస్ రోడ్లో కిళ్ళీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై తన దుకాణం వద్దకు వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి కొయ్యలగూడెం వైపుకు వెళ్తున్న లారీ మహాలక్ష్మి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మహాలక్ష్మి అక్కడిక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. టీడీపీ నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, పెను మర్తి రామకుమార్, షేక్ ముస్తఫా, నంబూరి రామచంద్రరాజు తదితర నాయ కులు మహాలక్ష్మి మృతదేహానికి నివాళులర్పించారు.

రూ.10 లక్షల విలువ చేసే ఐరన్ మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన గృహనిర్మాణ శాఖ డీఈ

దెందులూరు, మార్చి 9 : గృహ నిర్మాణశాఖలో రూ.10 లక్షలు విలువ చేసే ఐరన్ చోరీకి గురైంది. దెందులూరు మండలంలో గృహనిర్మాణశాఖ ఆధీనంలో ఉన్న లబ్ధిదారులకు ఇచ్చే ఇనుప ఊచలు మాయమయ్యాయి. దెందులూరు కొవ్వలి వెళ్లే రోడ్డులో బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో ఒక ప్రైవేటు స్థలంలోని గొడౌన్‌లో సిమెంట్ బస్తాలు, ఐరన్ రాడ్లు నిలువ ఉంచి గృహ నిర్మాణ లబ్ధిదారులకు అందించేవారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సుమారు 16 టన్నుల ఐరన్ రాడ్లు చోరీకి గుర య్యాయి. భద్రంగా ఉంచి ప్రజల గృహనిర్మాణ లబ్ధిదారుల సామాగ్రిని భద్రంగా ఉంచక పోవడంతో చోరీకి గురయ్యాయి. దీనిపై గృహ నిర్మాణశాఖ ఏఈని వివరణ కోరగా 16 టన్నులు ఐరన్ చోరీకి గురైన మాట వాస్తవమేనని తాను కొత్తగా బదిలీ వచ్చానని జిల్లా అధికారులకు వివరాలతో ఫిర్యాదు చేశానన్నారు.గృహనిర్మాణ శాఖ డీఈ మాట్లాడుతూ దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 300 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీన పరుచుకున్నట్లు నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఓగిరాల తండాలో నిర్వహించిన దాడుల్లో బెల్లపు ఊట ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీన పరుచుకున్నారు. తప్పించుకున్న నిందితురాపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వదిలేశాడు..

ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

ముదినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాపురం చేసేందుకు కుటుంబసభ్యులు నిరాకరిస్తున్నారనే కారణంతో ప్రేమించి పెళ్లి చేసుకుని గర్భం దాల్చాక భార్యను వదిలించుకునేందుకు భర్త ప్రయత్నిస్తున్న ఘటన ముదినేపల్లి మండలం కొరగుంటపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని దళితవాడకు చెందిన దీపిక అనే మహిళకు 2018లో పశ్చిమ గోదావరి జిల్లా గుమ్మలూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. ఒక బాబు పుట్టిన అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చాలాకాలం క్రితం ఇద్దరూ విడిపోగా, ఆమె గ్రామానికి వచ్చేసి తన తండ్రి వద్ద ఉంటూ గుడివాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వర్తి స్తున్నది. ఏడాది క్రితం కలిదిండి మండలం పోతుమర్రుకు చెందిన దండుబోయిన రామాంజనేయులు తన తండ్రి వీరాస్వామి అస్వస్థకు గురికాగా గుడివాడలో అదే ఆసుపత్రిలో చేర్పించాడు. ఆ సమయంలో అతడికి ఆమెకు మధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారి తీసింది. ఒక గుడిలో ఇరువురు దండలు మార్చుకుని, చర్చిలో వివాహం చేసుకున్నారు. కాపురం సజావుగా జరుగుతుండగా ఆ మహిళ గర్భం దాల్చింది. ఈ పరిస్థితుల్లో అతడు, తల్లిదండ్రుల మాట ప్రకారం వది లేశాడు. పెద్దలు చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడంతో ఆ మహిళ తనకు న్యాయం చేయాలని కోరుతూ ముదినేపల్లి పోలీసులను ఆశ్ర యించింది. కులం పేరుతో దూషించారని పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవం

కామవరపుకోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని గుర్రాలచెరువు గట్టు వద్ద ఉన్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ నిర్మాణ నిర్వాహకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, వెంకట సత్య శ్రీనివాసాచార్యులు తెలిపారు. స్వామికి ఈ సందర్భంగా తొలుత పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరిన నాయకులు

ఉంగుటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : జనసేనాని పవన్ కల్యాణ్ ఆశయాలను ఆచరించేలా ఉన్న వారు మాత్రమే పార్టీలో చేరి సేవలందించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద నిండ్రకొలనుకు చెందిన మాజీ ఉప సర్పంచి నక్కా రామకృష్ణ, కచ్చాల నాగేశ్వరరావు మూడవ వార్డు సభ్యుడు మచ్చా నాగేశ్వరరావుల నాయకత్వంలో పలువురు జనసేన పార్టీలో చేరారు.

టిడ్కో ఇళ్లను అప్పగించకపోతే ఆందోళన చేస్తాం

జంగారెడ్డిగూడెం(ఏలూరు), మార్చి 9(ఆంధ్రజ్యోతి) :జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలకు టిడ్కో ఇళ్లను ఏప్రిల్ 30వ తేదీ నాటికి అప్పగించకపోతే అబ్ధిదారులతో కలిసి పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా ఆదివారం స్థానిక మార్కండేయపురంలోని టిడ్కో అపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్లను అబ్ధిదారులకు అప్పగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకరరావు, ఎస్కే.సుభాషిణి, సుబ్బారావు, యశ్వంత్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

చింతలపూడి, మార్చి 9(ఆంధ్రజ్యోతి) :పామాయిల్ సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించి కార్డులివ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో పామాయిల్ కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 90 శాతం మంది కౌలు రైతులే సాగు చేస్తున్నారని, వీరిని గుర్తించి కార్డులిచ్చి 20 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించాలన్నారు. అలాగే పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో డి.కృష్ణ, పి.సోమశేఖర్, జె.రామచంద్రారెడ్డి, కంచర్ల గురవయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.రామాంజనేయులు తదితరులు పాల్గొని గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కుప్పాల సురేష్, కో-కన్వీనర్‌గా పాకనాటి సూరిబాబులను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న 60వ పేరంటాల వార్షికోత్సవాలు

కామవరపుకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సాగిపాడు పంచాయతీలోని రత్నగిరినగర్‌లోని శ్రీ రత్నతులసీ దేవి అమ్మవారి ఆలయం వద్ద 60వ పేరంటాల మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి భారీ సంఖ్యలో భక్తులు నివేదనలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుని పసుపు, కుంకుమలు సమర్పించి విశేష పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలియచేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో 16న మహా అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలియజేశారు.

అపరాల రైతులను ఆదుకోండి : కె.శ్రీనివాస్

ఏలూరు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అపరాల రైతులకు కనీస మద్ధతు ధర రాక నష్టపోతున్నామంటూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని జాలిపూడిలో రైతులు ఆదివారం నిరసన తెలిపారు. అపరాల కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అపరాల కొనుగోలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పెసర, మినుములు వంటి అపరాల పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రంగారావు, బైరెడ్డి లక్ష్మణరావు, తిరుపతి కృష్ణ, కె.హనుమంతు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సమ్మె డిమాండ్లను పరిష్కరించమంటే నిర్బంధిస్తున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి వైసాయి కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అంగన్వాడీ కార్యకర్తలను సీఐటీయూ నాయకులను అక్రమ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో 42 రోజుల పాటు సమ్మె నిర్వహించిన క్రమంలో టీడీపీ నాయకులు సమ్మె శిబిరానికి వచ్చి అనేక వాగ్దానాలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో స్పందించడం లేదన్నారు. ఈ క్రమంలో విజయవాడలో ధర్నాకు పిలుపు ఇచ్చిన క్రమంలో నిర్బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయ పునర్ నిర్మాణ పనులు వేగవంతం

టి.నరసాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : బొర్రంపాలెంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునర్‌నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. పూర్వం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అదే స్థానంలో ఆలయ పునర్ నిర్మాణ పనులు స్థానికులు చేపట్టారు. ఆదివారం ఆ క్రమంలో గడప ముహూర్తం కావడంతో భక్తులు కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు అడపా నాగరాజు, అప్పన పుల్లారావు, మధు, బాలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీపీఎం నాయకుడు కొండలరావు మృతి



పెదపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : సీపీఎం నాయకుడు మునునూరి కొండలరావు(72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పెదపాడులో కొండలరావు భౌతిక కాయంపై నాయకులు ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణలు పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి గుండపనేని సురేష్, కరీముల్లా, దాసు, షఫీరా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పత్తేబాదలో గంగానమ్మ జాతర

ఏలూరుకార్పొరేషన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని పత్తేబాద గ్రామదేవత ఆలయమైన గంగానమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం నుంచి 13వ తేదీ వరకు జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు నల్ల సత్యనారాయణవరప్రసాద్ తెలిపారు. 11న పసుపు, కుంకుమతో అమ్మవారి పుట్టింటివారైన రెడ్డివారు, అత్తింటివారైన కూర్మావారితో ఊరేగింపు, సహస్ర నామార్చన జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జాతరను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

భువ్వనపల్లిలో వైభవంగా కృష్ణుడు విగ్రహ పునఃప్రతిష్ఠ

నిడమర్రు, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : భువ్వనపల్లిలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన శ్రీకృష్ణ దేవాలయంలో నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మించిన ఈ ఆలయ నిర్మాణపనులు ఆదివారం ఉదయం నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చేగొండి మధుబాబు, అపర్ణనాగరోజ దంపతులచే ప్రతిష్ఠను శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు శ్రీనివాసులు శేషాచార్యులు వారిచే వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అఖండ అన్న సమారాధనలో సుమారు 3వేల మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

112 మందికి ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి9(ఆంధ్రజ్యోతి) : స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో ఆయుష్ వైద్య నిపుణులు డాక్టర్ బి.వి.ఎం.నగేష్ 112 మందికి పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక కౌన్సెలింగ్ జరిపి వ్యాధి నిర్ధారణ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మందులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. తాము సూచించినట్టు మందులు వాడుకుంటే సకాలంలో వ్యాధి నివారణ అవుతుందని, యథాస్థితికి వస్తారని చెప్పారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు, బొలిశెట్టి సురేష్, పి.పండరీనాథ్, పి.విఠల్ సేవలు అందించారు.

సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీ ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఫాల్గుణమాసంలోని ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించి అర్చకుల నుంచి రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. భక్తిరంజిని కార్యక్రమాన్ని భజన బృందం నిర్వహించగా స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది.

వైభవంగా సింగాలమ్మ ఊరేగింపు

ఉంగుటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : కైకరం దేవత సింగాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పుట్టినింటైన అద్దేపల్లి శేషయ్య ఇంటి వద్ద ఆ కుటుంబం సారె, చీర పెట్టి ఊరేగించారు. అలాగే కైకరంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి వార్షిక కల్యాణాన్ని ఆదివారం గ్రామ రజక సంఘం తరపున జరిపించారు. కొల్లేటి కోట పెద్దింట్లమ్మ ఉత్సవాల సమయంలో నిర్వహించేలా కల్యాణం నిర్వహించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీ..



రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

ట్రాఫికర్

రోడ్లపై వాహనాలతో తప్పని తిప్పలు

ఏలూరు టూటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పత్తేబాద రైతు బజారుకు కేటాయించిన పార్కింగ్ స్థలంలో దుకాణాల ఏర్పాటుతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చేసేది లేక రోడ్లపై పార్కింగ్ చేసుకుంటే వచ్చిపోయే వాహనాలకు సమస్యలు తలెత్తుతున్నాయి. రైతు బజారు అధికారులను వివరణ కోరితే ప్రజా ప్రతినిధుల రికమండేషన్లతో షాపులిచ్చామని తామేమీ చేయలేమని చెబుతున్నారు. పంటపండించే రైతులు నేరుగా రైతుబజారుకు తీసుకొచ్చి స్వల్పలాభంతో వినియోగదారులకు అమ్మాలనే నిబంధనను అధికారులు ఉల్లంగిస్తున్నారు. ఇదిలా ఉంటే రైతు బజారులో 100కు పైగా షాపుల్లో రైతులు కాదని, అంతా వ్యాపారులేనని విమర్శలు వినిపిస్తున్నాయి. పత్తేబాద మెయిన్ బజారులో నిలిచిపోయే ట్రాఫిక్ వల్ల స్కూల్‌కి వెళ్లే విద్యార్థుల నుంచి వ్యా పారుల వరకు అందరికీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రైతు బజారులో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్లేరు ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం

సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్న ఎంపీ



ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే చింతమనేనికి సత్కారం

ఏలూరు రూరల్/టూటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి) : కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వీలుగా పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించి కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలంలో కాట్లంపూడి, జాలిపూడి, గుడివాకలంక గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన ప్రారంభించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి పర్యటించారు. గుడివాకలంకలో గ్రామస్థుల విద్యుత్ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురావడంతో కోటి రూపాయలను వెచ్చించి ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు.ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడానికి నెక్స్‌జెన్ కంపెనీ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం సహకారంతో రూ.30 లక్షలతో నిర్మించిన రెండు వాటర్ ప్లాంట్లను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రారంభించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుతం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో ఉన్న కేసులో క్లియరెన్స్ తీసుకుని అనుమతులు వచ్చిన వెంటనే ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏలూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ టీడీపీ సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ మహేష్ మాట్లాడుతూ రాజధాని అమరావతితో పాటు ఏలూరు సిటీని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణయ్యతో కలిసి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ మహేష్ సహకారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.



అవార్డు అందుకుంటున్న ఏపీఎం వెంకాయమ్మ



ఐసీడీఎస్ పీవో మాధవి



జ్ఞాపిక అందుకుంటున్న శ్యామల

ఉత్తమ సేవకు అభినందన

లింగపాలెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలానికి ఏపీఎంగా పనిచేస్తున్న కొత్తపల్లి జ్యోతి వెంకాయమ్మ సేవలను గుర్తించి మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో పలువురు ప్రముఖులు అభినందించారు. మండలంలో మహిళా సంఘాలకు రుణాలందిస్తూ వారి ఆదాయాభివృద్ధికి తోడ్పాటునందిస్తూ మహిళా సంఘాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినందుకు ఈ అవార్డు అందుకున్నట్టు వెంకాయమ్మ తెలిపారు.

● చింతలపూడి : ఐసీడీఎస్ మండల ప్రాజెక్టు ఆఫీసర్ మాధవి ఉత్తమ సేవలను గుర్తించి కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆమెను ఐసీడీఎస్ పరిధిలో శాలువాకప్పి అభినందించారు. ఈ అవార్డు వచ్చినందుకు కార్యాలయ సిబ్బంది, సూపర్ వైజర్లు ఆమెకు అభినందనలు తెలిపారు.

● ఏలూరు రూరల్ : శ్రీశ్రీ కళావేదిక ద్వారా తెలుగు, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో ఉత్తమ సేవలు అందజేస్తున్నందుకు ప్రముఖ కవయిత్రి శ్యామల హరికోటికి మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలో నారీ రత్న బిరుదుతో ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ సమన్వయకర్త కె.రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరిభూషణం, పార్థసారథి చేతుల మీదుగా బిరుదును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ పాల్గొనగా హరికోటిని పలువురు ప్రముఖులు అభినందించారు.

మోడల్ స్కూళ్లతో నాణ్యమైన విద్య



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, విద్యాధికారులు

చింతలపూడి, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మోడల్ స్కూళ్ల ఏర్పాటు చేయడం వల్ల నాణ్యమైన విద్యను అందించవచ్చని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి క్యాంపు కార్యాలయంలో ఆయన నాలుగు మండలాల విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, దీనిని ప్రజలంతా ఆమోదించే రీతిలో రూపొందించినట్టు పేర్కొన్నారు. మోడల్ స్కూళ్ల ఏర్పాటు చేసి ప్రతీ విద్యార్థికి ఆరు వేల రూపాయలు ప్రయాణ ఖర్చులిచ్చేలా ప్రభుత్వం ప్రతిపాదనలు చేస్తోందన్నారు. ప్రజలంతా నూతన విద్యా విధానాన్ని స్వాగతించాలన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు సీఎం రిలీఫ్ ఫండ్ దోహదం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ద్వారకాతిరుమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు సీఎం సహాయ నిధి ద్వారా మెరుగైన వైద్యాన్ని పొందవచ్చని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో ఆదివారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇద్దరు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం తిమ్మాపురం టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు కొయ్యలమూడి వెంకట సరిత అత్త, శతాధిక వృద్ధురాలు కొయ్యలమూడి వెంకమ్మ (101) మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.

● ఏలూరుటూటౌన్ : పేదల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం 15మందికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులు రూ.18 లక్షల 58వేలు బాధితులకు అందజేశారు. సీఎం ఆర్ఎఫ్ 45 అప్లికేషన్లు పెండింగులో ఉన్నాయని వారందరికీ త్వరలోనే చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో శివ ప్రసాద్, కె.శ్రీనివాస్, కిషోర్, తిరుపతి, రాజేశ్వర్, టి.రాజేష్, ఎం.రమేష్, కే.విజయలక్ష్మి, సీహెచ్ గణేష్ పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆర్థిక భరోసా ఇస్తుందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఏలూరు ఎంపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి 11లక్షల 62వేలు చెక్కులను 14 మంది లబ్ధిదారులకు మహేష్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ అత్యవసర సమయాల్లో చికిత్స చేయించు కున్న బాధితులకు సీఎం సహాయ నిధి అండగా ఉం టుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి సూపర్ 6 పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

12న చేగొండపల్లిలో వైద్య శిబిరం



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

పోలవరం, మార్చి9(ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ ఈ నెల 12న చేగొండపల్లిలో నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రచార రథాన్ని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో వివిధ అనారోగ్య సమస్యల వైద్య శిబిరాలను నిర్వహిస్తూ గిరిజనుల అభివృద్ధికి తోడ్పడుతున్న ఐటీడీఏ సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ నేత్ర వైద్యశిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఐటీడీఏ అనీల్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం గౌతమీ నేత్రాలయం ఆధ్వర్యంలో మార్చి 12న చేగొండపల్లి పునరావాస కాలనీలో రైతు సేవా కేంద్రం వద్ద ఉచిత నేత్ర, జనరల్ సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, సర్పంచులు జారం సీతారామలక్ష్మి, కలుం బాపిరాజు, సబ్బారపు శ్రీరామ్మూర్తి, ఎస్టీయూ యూనియన్ నాయకులు పాతకోట పోశిరావు, నియోజకవర్గ నాయకులు కాటాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఓపెన్ చెస్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం(ఏలూరు), మార్చి9(ఆంధ్రజ్యోతి) : జెట్టి సత్యారావు మెమోరియల్ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆదివారం ప్రతిభ పాఠశాలలో ఉత్సాహంగా జరిగింది. ఈ చెస్ టోర్నమెంట్‌లో రాష్ట్ర నలుమూలల నుంచి 220 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ఏలూరుకు చెందిన దేవరపల్లి లక్ష్మణరావు విన్నర్‌గా నిలిచారు. ద్వితీయ స్థానంలో విజయవాడకు చెందిన జడల మల్లేశ్వరరావు, తృతీయ స్థానంలో రాజమండ్రికి చెందిన కొరపర్తి సీతాసాగర్ నిలిచారు. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర వైసిపి కార్యదర్శి జెట్టి గురునాథరావు చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ నిర్బంధం సరికాదు : సీఐటీయూ

ఏలూరు కార్పొరేషన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని సోమవారం విజయవాడలో తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం సరికాదని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్‌లు ఆదివారం పేర్కొన్నారు. విజయవాడ వెళ్లడానికి వీల్లేదని అంగన్‌వాడీలను అన్నిచోట్ల నోటీసులివ్వడం, అంగన్‌వాడీలను బెదిరించడం తగదని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చాక అవకాశవాదంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీల అక్రమ అరెస్టులు తగదని బౌద్ధధర్మ మహాసభ చైర్మన్ ఆర్.మణిసింగ్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి, కెవిపిఎస్, ఏపీ రైతు సంఘం నాయకులు ఎ.ఫ్రాన్సిస్, కె.శ్రీనివాస్‌లు తెలిపారు.



డ్రైనేజీకి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రామారావు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొయ్యలగూడెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : గ్రామాల భివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గంజిమాల రామారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని రాజవరం పంచాయతీ గంగవరం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. మారుమూల గ్రామాల భివృద్ధికి మండల పరిషత్ నిధులు కేటాయిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి చినతుక్కయ్య, ఎంపీటీసీ చింతయ్య, రేణుకాబాల, నరేష్, పి.రవికుమార్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గం

రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం(ఏలూరు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ గోల్డ్ చార్టర్ అధ్యక్షురాలిగా నాగసూరి మాధురి, కార్యదర్శిగా ఎస్.పద్మజ్యోతితో కూడిన నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. వీల్ క్లబ్ చైర్మన్ ఎ.లక్ష్మీ శ్రీనివాస్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. 2026 జూన్ 30 వరకు ఈ కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందని ఆమె తెలిపారు. అనంతరం దాతల సహకారంతో ఇంటర్ విద్యార్థులకు, పక్ష వాత రోగికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు జెట్టి గురునాథరావు, పరిమి సత్తిపండు, అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ, చామర్తి శ్రీరాములు, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఊడా రాంగోపాల్, బవిరిశెట్టి హనుమాన్, కెఎస్ఎన్.ధన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం బీసీల పక్షపాతి

ఏలూరుటూటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా సెమినార్ గోడపత్రికను ఆవిష్కరించారు.ఢిల్లీలో ఈ నెల 18,19 తేదీల్లో జరిగే సెమినార్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ బీసీలకు 37శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. దీనిలో 50శాతం మహిళలకు సబ్‌కోట కేటాయించాలని పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామన్నారు. కులగణన తరువాత బీసీ మహిళలకు ఎక్కువగా రాజకీయ అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీ.దుర్గానరేష్, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భీమవరపు హేమసుందరి, రాష్ట్ర కన్వీనర్ విక్రంనాగు, భీమవరపు సురేష్, వరప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు

వైభవంగా అమ్మవార్ల జాతర

భీమడోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులో జరుగుతున్న జాతరలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీగంగానమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ, పోతురాజు జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. జాతరలో భాగంగా పలు స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థల ఆధ్వర్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో బుధవ్యాస్, ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ శేషపుగిరి, నడిపూడి ఈశ్వరరావు, శ్రీ అమ్మ భగవాన్ సేవకులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్టు ఈవో సతీష్ కుమార్ తెలిపారు.

నేడు సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ

జంగారెడ్డిగూడెం(ఏలూరు), మార్చి 9(ఆంధ్రజ్యోతి) : భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతిని పురస్కరించుకుని 10వ తేదీన ఉదయం తొమ్మిదిన్నరకు స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఆమె విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ, అభ్యుదయ వాదలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శనీశ్వరాలయంలో పంచమ వార్షికోత్సవం ప్రారంభం

కామవరపుకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లి గ్రామంలోని శ్రీ మందా సమేత శనీశ్వర ఆలయం వద్ద ఈనెల 13వ తేదీ వరకు జరగనున్న ఆలయ పంచమ వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామ సర్పంచ్ గూడపాటి కేశవరావు నూతన వస్త్రాలు బహూకరించగా మద్దిపాటి నాగ వెంకట సత్యనారాయణ - ధనలక్ష్మి దంపతులు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. పోలుబోయిన గంగరాజు దంపతులు అమ్మవారికి, స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త తాతా సర్వేశ్వరరావు - లక్ష్మి నర్సాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఏలూరు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అసోసియేషన్ భవనంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ నేత్ర వైద్య సంస్థ మాక్స్ విజన్ డాక్టర్ల బృందం 50మంది రోగులకు నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్.ఎస్.ఆర్ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు గొర్ల రామారావు, రామ్మోహన్‌రావు పర్యవేక్షించారు.

మట్టి కోసం ఎంపీకి వినతి

కొయ్యలగూడెం, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : మట్టిలేక పేదలు ఇళ్లు నిర్మించుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని అనుమతి ఇప్పించాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేష్ వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఏలూరు ఎంపీ కార్యాలయం వద్ద మట్టిసమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆదివారం స్థానిక ప్రశాంతి వాకర్స్ సంఘ భవనంలో విజయవాడ మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దున్నా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం 60మందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. సంఘ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రామ్మోహనరావు, గౌరవాధ్యక్షుడు రామారావు, డాక్టర్ ఎం.శివరామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

పెదపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : తోటగూడెం వద్ద పేకాడుతున్నారనే సమాచారంతో దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్టుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వారి నుంచి రూ.4,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సమితిలో అగ్ని ప్రమాదం

ఉంగుటూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు రెవెన్యూ పరిధిలోని అటవీ సంరక్షణ సమితిలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం అగ్ని ప్రమాపక సిబ్బంది, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ శ్రీశైలం, ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాజేష్,జయబాబు తదితరుల ఆధ్వర్యంలో మంటలు ఆర్పారు. విషయం తెలిసిన ఇన్‌ఛార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్, ఆర్.ఐ.రాజులు పర్యవేక్షించారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


బొమ్మినంపాడు వద్ద రోడ్డు నుంచి విడిపోతున్న వంతెన

ప్రమాదకరంగా బొమ్మినంపాడు వంతెన

కుంగుతున్న అప్రోచ్ రోడ్డు


వంతెన వద్ద కుంగుతున్న రోడ్డు

ముదినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బొమ్మినంపాడు వద్ద క్యాంప్ బెల్ కాల్వపై ఉన్న వంతెనకు ఇరువైపులా ప్రమాదస్థితి నెలకొంది. ఒకవైపు అప్రోచ్ రోడ్డు నుంచి వంతెన విడిపోతుండడం మరో వైపు రోడ్డు కోతకు గురికావడంతో ఈ వంతెన ఉనికికే ప్రమాదం ఏర్పడింది. బొమ్మినంపాడు నుంచి వేయవరప్పాడు వెళ్లే ప్రధాన పంచాయతీరాజ్ రహదారిలో ఉన్న ఈ వంతెనను క్యాంప్ బెల్ కాల్వపై అప్పట్లో జలరవాణాకు అనుకూలంగా ఉండేలా నిర్మిం చారు. వంతెనను ఎత్తుగా నిర్మించారే కానీ ఇరువైపులా అప్రోచ్ రోడ్లు ఎత్తు పెంచలేదు. దీంతో వంతెన పైకి ఎక్కేందుకు సైక్లిస్టులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, లోడు వాహనాల స్పీడుకు వంతెన సామర్థ్యం తగినంతగా లేదు. దీంతో వంతెనకు అప్రోచ్ రోడ్డుకు మధ్య ఖాళీ ఏర్పడి విడిపోతోంది. వంతెన నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో అప్రోచ్ రోడ్లు కృంగిపోయే ప్రమాదం నెలకొంది. పంచాయతీరాజ్ శాఖ అధికారు లు, ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ వంతెన వైపు కన్నెత్తి చూడడం లేదని, అప్రోచ్ రోడ్లు రెండు వైపులా ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.


ముసునూరు పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న భవనం

ఈ భవనం.. విష సర్పాలకు నిలయం

ముసునూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న భవనం విష సర్పాలకు నిలయంగా మారింది. ఈ భవనం నుంచి పాములు పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల రెండు పాములు పాఠశాల గదుల్లోకి వెళ్లడంతో విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. శిథిల భవనాన్ని తొలగించడానికి గత వైసీపీ ప్రభుత్వం టెండర్

విద్యార్థుల్లో భయాందోళన

పిలువగా ఎవరూ ముందుకు రాలేదు. భవనం లోపల చెట్లు, పుట్టలు పెరిగిపోయి విష సర్పాలు, పురుగులకు ఆవాసంగా మారింది. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు సమస్యను మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లారు. శిథిల భవనాన్ని తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు డీసీ చైర్మన్ పొత్తూరు వాసురాజు అన్నారు. ఆదివారం భుజబలపట్నం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భీమవరానికి చెందిన ఐడెల్ విజన్ సూపర్‌స్పెషాల్టీ కంటి హాస్పిటల్ వైద్యులు పెన్మెత్స కృష్ణచైతన్య, పెన్మెత్స సూర్యసౌమిత్, పెన్మెత్స భాస్కరరాజు 155 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మందికి కంటి ఆపరేషన్ కోసం రిఫర్ చేయగా 34 మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. శిబిరంలో గ్రామస్థులు ముదునూరి నారాయణరాజు, పెన్మెత్స కృష్ణంరాజు, ముదునూరి కొండరాజు, పెన్మెత్స త్రినాథరాజు, గొట్టుముక్కల రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నూజివీడు:ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూజివీడు విక్టోరియా టౌన్‌హాల్ వద్ద మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ హాస్పిటల్స్ వైద్యులు కార్డియాక్, న్యూరో, గ్యాస్ట్రో, ఆర్థో, యూరాలజీ తదితర విభాగాల్లో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉచిత క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వైద్యులు అశోక్‌కుమార్, రవితేజ, బీకేవీ ప్రసాద్, కిరణ్‌భాష, ఎం.సతీష్ పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

ముదినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దళిత సంఘాలు రాజకీయాలకతీతంగా సమష్టి కృషి చేయాలని ముదినేపల్లి మండల ఆదర్శ దళిత హక్కుల పరిరక్షణ సంఘం తీర్మానించింది. ఆదివారం ముదినేపల్లిలో సంఘ అధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో ప్రభుత్వ శాఖలపరంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు దళిత నాయకులు కృషి చేయాలని తీర్మానించారు. పోలీస్ స్టేషన్‌లో జాప్యం జరిగే కేసులను, రెవెన్యూ శాఖ పరంగా జరగాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు గ్రామస్థాయి నుంచి దళిత సంఘాల నాయకులు కలసి రావాలని భిక్షాలు కోరారు. ముదినేపల్లిలో జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయడంలో ఎన్‌హెచ్ అధికారులు జాప్యం చేస్తున్నారని నాయకులు విమర్శించారు. సంఘ గౌరవాధ్యక్షుడు లేళ్ల ఆంజనేయులు, నాయకులు కోటే ప్రవీణ్, బేతపూడి వెంకటరమణ, ముత్యాల రాంబాబు, ఛామనపూడి సుధాకర్ పాల్గొన్నారు.

రేపు యూత్ కాంగ్రెస్ ఆందోళన విజయవంతం చేయాలి

నూజివీడు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ కల్పనపై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 11న విజయవాడలో నిర్వహించే ఆందోళనను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్‌కుమార్ కోరారు. నూజివీడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగాన్ని పారద్రోలేలా 20 లక్షల ఉద్యోగాలు తీసుకువస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగాలు యువతకు రాలేదన్నారు. దీనిపై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌వద్ద ఆందోళనను నిర్వహిస్తున్నామన్నారు. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయభాను, రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, యువజన కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మమత నాగిరెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో యువత విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వదిలేశాడు

» గర్భం దాల్చిన మహిళ » ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ముదినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాపురం చేసేందుకు కుటుంబసభ్యులు నిరాకరిస్తున్నారనే కారణంతో ప్రేమించి పెళ్లి చేసుకుని గర్భం దాల్చాక భార్యను వదిలించుకునేందుకు భర్త ప్రయత్నిస్తున్న ఘటన ముదినేపల్లి మండలం కొరగుంటపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని దళితవాడకు చెందిన దీపిక అనే మహిళకు 2018లో పశ్చిమ గోదావరి జిల్లా గుమ్మలూరుకు చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. ఒక బాబు పుట్టిన అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చాలాకాలం క్రితం ఇద్దరూ విడిపోగా, ఆమె గ్రామానికి వచ్చేసి తన తండ్రి వద్ద ఉంటూ గుడివాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వర్తిస్తుంది. ఏడాది క్రితం కలిదిండి మండలం పోతుమర్రుకు చెందిన దండుబోయిన రామాంజనేయులు తన తండ్రి వీరాస్వామి అస్వస్థకు గురికాగా గుడివాడలో అదే ఆసుపత్రిలో చేర్పించాడు. ఆ సమయంలో అతడికి ఆమెకు మధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారి తీసింది. ఒక గుడిలో ఇరువురు దండలు మార్చుకుని, చర్చిలో వివాహం చేసుకున్నారు. కాపురం సజావుగా జరుగుతుండగా ఆ మహిళ గర్భం దాల్చింది. ఈ పరిస్థితుల్లో అతడు, తల్లిదండ్రుల మాట ప్రకారం వది లేశాడు. పెద్దలు చేసి ప్రయత్నాలు ఫలించక పోవడంతో ఆ మహిళ తనకు న్యాయం చేయాలని కోరుతూ ముదినేపల్లి పోలీసులను ఆశ్ర యించింది. కులం పేరుతో దూషించారని పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల మలుపులు ప్రమాదకరం

ముదినేపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-బంటుమిల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో పలు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల్లో ముళ్లపొదలు, చెట్లు పెరిగి మూసుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సింగరాయపాలెం - పెదతుమ్మిడి మధ్య ముళ్ల చెట్లు రోడ్డునే మూసేశాయి. డబుల్ రోడ్డు సింగిల్ రోడ్డుగా మారిపోయింది. ఏళ్ల తరబడి ఉప్పరగూడెం గ్రామ మలుపులో రోడ్డు పెదలంక మేజర్ డ్రెయిన్ నీటి ప్రవాహానికి కోసుకుపోగా లోడు వాహనాలు బోల్తా పడుతున్నాయి. ఈ మలుపు ప్రమాదకరంగా ఉంది. ఆక్వా రంగం పెరిగాక ఈ రూటులో నిత్యం చేపలు, రొయ్యల మేతలను రవాణా చేసే భారీ వాహనాలు వెళ్లటమే కాక, ఆక్వా ఉత్పత్తులను బంటుమిల్లి, ముదినేపల్లి మండలంలోని పలు ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. కొత్తపల్లి-మల్లపరాజుగూడెం మధ్య ముళ్ల చెట్లు రోడ్డును మూసేశాయి. సింగరాయపాలెం - ఉప్పరగూడెం, వడాలి-సింగరాయపాలెం మధ్య రోడ్ల మార్జిన్లలోని చెట్లను ఆర్అండ్‌బీ అధికారు లు తొలగించాల్సి ఉంది.


సింగరాయపాలెం-ఉప్పరగూడెం మధ్య మలుపులో చెట్లు.. (ఇన్‌సెట్‌లో) బోల్తా పడిన చేపల మేత లారీ (ఫైల్)

ఈ చెట్లను యంత్రాలతో తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మలుపుల వద్ద రోడ్లను విస్తరించాలి



సింగరాయపాలెం-మల్లపరాజుగూడెం మధ్య బంటుమిల్లి రహదారిలో మలుపుల వద్ద రోడ్లను విస్తరించాలి. మార్జిన్లలో పెరుగుతున్న ముళ్ల చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. చెట్లు మొదలుతో సహా తొలగించాల్సిన అవసరం ఉంది.
- కసెట్టి నాగబాబు, నారాయణపురం

పెయింటింగ్ పోటీల్లో ఇంగిలిపాకలంక విద్యార్థిని జిల్లా సెకండ్

మండవల్లి మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి పెయింటింగ్ పోటీల్లో ఇంగిలిపాకలంక జడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని ఘంటసాల రజని ద్వితీయస్థానం సాధించిందని హెచ్ఎం శాంతకుమారి తెలిపారు. మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ పదో వార్షికోత్సవం, కళా తపస్వీ దామెల రామారావు పుట్టినరోజు, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాస్మోపొలిటన్ క్లబ్ వారు ఫిబ్రవరి 23న పోటీలు నిర్వహించారు. మచిలీపట్నంలో ఆదివారం విద్యార్థినికి బహుమతి అందజేశారు.


కొత్త మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చిన్నంపేటలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

చాట్రాయి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్నందున చిన్నంపేటలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నివారణా చర్యలు చేపట్టారు. స్థానిక శివాలయం వద్ద రక్షిత పథకం బోరులోని మోటారు మరమ్మతు కావడంతో సర్పంచ్ పరసా ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి కొత్త మోటారును ఆదివారం ఏర్పాటు చేశారు. వేసవిలో నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో రోబోటిక్స్ హ్యాకథాన్


డైరెక్టర్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో టెక్‌జెట్-25 కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోబోటిక్స్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 13 కళాశాలల నుంచి ఆర్టిఫీషియల్ ఇంటె లిజెన్స్ హ్యాకథాన్‌లో 71 జట్లు, రోబోటిక్స్ హ్యాకథాన్‌లో 10 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి లాంచనంగా ప్రారంభించి మాట్లాడారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యే టెక్‌జెట్-25 కార్య క్రమం మూడురోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు.

వైభవంగా పెద్దింటమ్మ ఉత్సవాలు

కలిదిండి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని పూలమాలలు నిమ్మకాయలతో అలంకరించి అధిక సంఖ్యలో భక్తులు విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో పురాతన దేవస్థానాల్లో ఒకటైన గురజ గ్రామంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈనెల పదో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈనెల 14 వరకు జరుగుతాయి. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పదో తేదీన స్వామివారి స్నపన తిరుమంజనోత్సవం, స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడం, 11న నిత్యహోమం, శ్రీ చక్రత్తాళ్వార్ ఊరేగింపు, జగజ్యోతి, సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు, 12న ఉదయం ఏనుగు వాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రి కల్యాణోత్సవం, 13న శ్రీ చక్రత్తళ్వార్ ఊరేగింపు, వాస్తు బలి, రథోత్సవం, 14న వసంతోత్సవం, ద్వాదశారాధనలు, అశ్వ వాహనోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలకు దేవస్థానం వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

నూజివీడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ అన్నారు. పోతురెడ్డిపల్లి యూపీ పాఠశాలలో కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు కుటుంబసభ్యులు సాన్వి స్మారకార్థం నిర్మించిన భోజన ప్రాంగణాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆరు సంవత్సరాల వయస్సులో అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందిన సాన్వి జ్ఞాపకార్థం కొమ్మన బూపేష్‌బాబు రూ.3లక్షల వ్యయంతో భోజన ప్రాంగణాన్ని నిర్మించటం అభినందనీయమన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, గ్రామసర్పంచ్ సుజాత, విద్యాకమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ అక్కినేని చందు, మాజీ ఎంపీటీసీ అక్కినేని సుజాత, రాజా, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

'సీఎం సహాయ నిధి' పేదలకు వరం : మంత్రి పార్థసారథి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి

నూజివీడు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం వంటిదని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి 90 మంది లబ్ధిదారులకు 65.54 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను లాంఛనంగా ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేదల అభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నూజివీడు మండల టీడీపీ అధ్యక్షులు ముసునూరు రాజా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య, నూజివీడు కౌన్సిలర్ కొమ్మన విజయ, అన్నవరం మాజీ సర్పంచ్ వీరమాచినేని సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యకులు ఆలూరి చిన్ని, టీడీపీ నాయకులు యాదాల సత్యనారాయణ, యనమదల నాని, వల్లభనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు మండలంలో..

ముసునూరు : చింతలవల్లికి చెందిన అనగాని శ్రీనివాసరావుకు రూ.1,16,427, రణక్కపేటలకు చెందిన కొండా సాయికి రూ.37 వేలు, ఉన్నం శ్రీలేఖకు రూ.30వేలు విలువగల సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని బలరాం, నాయకులు కొల్లి గంగారామ్, రంగు శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాశం నాగబాబు పాల్గొన్నారు.


స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ


కోటపాడులో దళిత మహిళను సన్మానిస్తున్న దృశ్యం

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కైకలూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కైకలూరు శ్రీకామాక్షి పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో 10మంది పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులను బహూకరించారు. ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వారిని ఘనంగా సత్కరించి వారి చేస్తున్న సేవలను కొనియాడారు. స్వర్ణకార సంఘానికి చెందిన మహిళలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ చైర్మన్ టీకే వెంకటసత్యనారాయణ, స్వర్ణకార సంఘం అధ్యక్షులు అనుబోజు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోటపాడులో మహిళా కూలీలకు సన్మానం

చాట్రాయి : మండలంలోని కోటపాడులో ఆదివారం జరిగిన మహిళా దినోత్సవంలో పది మంది ఎస్సీ ఎస్టీ మహిళా కూలీలను ఘనంగా సన్మానించారు. అంజలీ ఎస్సీ, ఎస్టీ ల్యాండ్ లెస్‌పూర్ పీపుల్ ట్రైబుల్ సొసైటీ ఆధ్వర్యంలో కోటపాడు, చీపురుగూడెం, మర్రిబంధం గ్రామాలకు చెందిన మహిళా కూలీలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నేషనల్ బీఆర్ అంబేడ్కర్ అవార్డు గ్రహీత పల్లె ప్రభుసాయి, ముఖ్య అతిథులుగా విజయకుమారి, సుజాత, జయంతి, సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరశింహారావు, జ్యోతి, సుమన్, సురేష్ బాబు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రాజెక్టులో కేకేఆర్ విద్యార్థులు ఫస్ట్


మొదటిస్థానం సాధించిన కేకేఆర్ విద్యార్థులు

ఆగిరిపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల తాడేపల్లిలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ ప్రాజెక్టులో మొదటిస్థానం సాధించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా, వేల్లేరు ఇంటర్నేషనల్ స్కూల్ చెన్నైవారి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో రాష్ట్ర వ్యాప్తంగా 45 స్కూల్ నుంచి 500 ప్రాజెక్ట్ స్వీకరించగా అందులో కేకేఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన 'సాఫ్ట్ షీల్డ్, సేఫ్టీ షీల్డ్ ఫర్ బైక్ ప్రదర్శలనకు రాష్ట్రస్థాయిలో ఎంసీబీలో మొదటి స్థానం, సేఫ్టీ షీల్డ్ ఫర్ బైక్ 5వ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కె.కోటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం మంజునాథ్ విద్యార్థులను అభినందించారు.

12న ఉపాధి హామీ సమస్యలపై ధర్నా విజయవంతం చేయాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న మహంకాళీరావు

కలిదిండి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సమస్యలపై విజయవాడలో ఈనెల 12న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళీరావు అన్నారు. ఆదివారం మూల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు పనులు అదనంగా కల్పించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్లతో నిర్వహించే మహా ధర్నాలో వ్యవసాయ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.


చిన్నిని అభినందిస్తున్న సభ్యులు

టూవీలర్స్ మెకానిక్స్ జిల్లా అధ్యక్షుడిగా చిన్ని

నూజివీడు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర టూవీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి చిన్ని నియమితులయ్యారు. ఆదివారం నూజివీడులో అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సుభానీ, ఏలూరు జిల్లా అధ్యక్షునిగా యర్రంశెట్టి చిన్నిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యానికి గురైన మెకానిక్ బసవయ్య, సుబ్బారాయుళ్లకు అసోసియేషన్ తరఫున రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పుల శౌరి తదితరులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తుల పూజలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ముదినేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు, అభిషేకాలు జరిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు పాలపొంగళ్ల తయారుచేసి స్వామికి నివేదనగా సమర్పించారు. పుట్టలో పాలు పోసి నాగ ప్రతిమలకు పూజలు జరిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు వీరభద్రశర్మ, బాలగంగాధర తిలక్ అభిషేకాలు నిర్వహించారు. బాలాజీ మఠంలోని నాగేంద్రుడికి భక్తులు పూజలు జరిపారు. ఈవో పుప్పాల యేసునాయుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.


కంప్యూటర్‌ను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ముసునూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల జడ్పీ పాఠశాలకు పూర్వవిద్యార్థులు ఆదివారం కంప్యూటర్ సెట్‌ను వితరణ చేశారు. పూర్వ విద్యార్థి గరికిముక్కు నాని ఆధ్వర్యంలో రూ.20వేలు విలువ గల కంప్యూటర్ సెట్‌ను హెచ్ఎం ఎం.శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 300 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీన పరుచుకున్నట్లు నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఓగిరాల తండాలో నిర్వహించిన దాడుల్లో 300 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీన పరుచుకుని ఘటనా స్థలం నుంచి తప్పించుకున్న నిందితురాలు దారావతు పార్వతిపై కేసు నమోదు చేశామన్నారు.